సాక్షి
వికారాబాద్
సోమవారం ၊ 31 ၊ మార్చి ၊ 2025



కనిపెట్టాలి ఓ కంట

పాఠశాలలకు ఒంటి పూట బడులు కొనసా గుతున్నాయి. మధ్యాహ్నం పిల్లలు ఆటలాడేం దుకు బయటకు వెళ్తుంటారు. 8లో▸



భద్రేశ్వరస్వామి జాతర

భావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో తొలి ఘట్టానికి శ్రీకారం చుట్టారు. ఉగాది రోజు ప్రత్యేక పూజలు చేశారు. 8లో▸



వామ్మో.. కంపు!

మురుగు సమస్యతో మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ముస్లింలకు స్పీకర్ శుభాకాంక్షలు



అనంతగిరి: రంజాన్ పండుగ(ఈద్–ఉల్–ఫితర్)ను పురస్కరించుకుని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజుల పాటు నిష్టతో ఉపవాస దీక్షలు చేసి జరుపుకునే పండుగ రంజాన్ అన్నారు. క్రమశిక్షణ, ప్రేమ, దయ, కరుణ, శాంతి, సహనం, సౌభ్రాతుత్వం ఇస్లాం బోధిస్తుందని ఇది అందరికి అనుసరనీయం, ఆచరనీయమని చెప్పారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు

ఎట్టకేలకు స్పందించిన విద్యుత్ అధికారులు



మొత్కూర్ సబ్‌స్టేషన్ వద్ద డీడీలు కట్టిన రైతులతో ఏఈ వినయ్‌కాంత్

సాక్షి ఎఫెక్ట్..

దోమ: డీడీలు కట్టి ఏళ్ల తరబడి నిరీక్షించిన రైతుల కష్టాలు తీరిపోనున్నాయి. ఈ నెల 29 (శనివారం)న సాక్షి దినపత్రికలో ట్రాన్స్‌ఫార్మర్లు కష్టాలు అనే శీర్షికన ప్రచురించిన కథనానికి ఎట్టకేలకు అధికారులు స్పందించారు. ఈ మేరకు ఆదివారం మొత్కూర్ గ్రామానికి చెందిన ఎనిమిది మంది డీడీలు కట్టిన రైతులను సబ్‌స్టేషన్‌కు అధికారులు పిలిపించి రసీదులు పరిశీలించారు. రెండు, మూడు రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్లు వాటికి సంబంధించిన వైర్లు, స్తంభాలను అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో కర్షకులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి అధికారి బాధ్యతతో పని చేస్తూ తమ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

కలరిపయట్టు శిక్షకుడికి ఉగాది పురస్కారం



ఉగాది పురస్కారం అందుకుంటున్న శిక్షకుడు రమేశ్ ఆచార్య

కొడంగల్ రూరల్: హైదరాబాద్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు యూనివర్సిటీలో ఉగాది సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో కొడంగల్ కలరిపయట్టు శిక్షకుడు రమేశ్ ఆచార్య పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం వర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో అరుదైన ప్రాచీన యుద్ధ కళ కలరిపయట్టు జట్టుకు అవార్డు దక్కిందని ఆయన తెలిపారు. కృషి, పట్టుదల, ఏకాగ్రత, ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు.

చాయ్‌వాలా కుమారుడు.. అగ్నివీరుడు



అగ్నిపథ్‌కు ఎంపికైన అబ్దుల్ జబ్బార్

పూడూర్: చాయ్‌వాలా కుమారుడు అగ్నిపథ్ పథకంలో ఆర్మీ ఉద్యోగానికి అర్హత సాధించాడు. మండల పరిధిలోని చెన్గోముల్ గ్రామానికి చెందిన అబ్దుల్ అజీజ్ టీస్టాల్ నిర్వహిస్తూ వచ్చిన కొద్ది ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పిల్లల విద్యాభివృద్ధికి మొక్కవోని దీక్షతో కష్టపడ్డాడు. ఆయన కష్టానికి ఫలితంగా పెద్దకుమారుడు అబ్దుల్ జబ్బార్ ఇటీవల విడుదలైన అగ్నిపథ్ పథకంలో అగ్నివీరుడుగా ఎంపికయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తుండగా.. గ్రామస్తులు అభినందినలతో ముంచెత్తుతున్నారు.

కాంగ్రెస్‌పార్టీ రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్‌గా ప్రమీల



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఎస్సీసెల్ మహిళా విభాగం కన్వీనర్‌గా జి.ప్రమీలను నియమిస్తూ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జిల్లా ఎస్సీ సెల్ విభాగం ఇన్‌చార్జి పెంటయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మెయిన్స్‌లో మెరిశారు

గ్రూప్-1 ఫలితాల్లో సత్తాచాటిన జిల్లా వాసులు

ఉగాది పర్వదినం రోజున గ్రూప్–1 మెయిన్స్ ఫలితాలు విడుదలవడంతో ఎంపికైన విద్యార్థులు పండుగ చేసుకున్నారు. ఆదివారం టీజీపీఎస్సీ విడుదల చేసిన ఫలితాల్లో జిల్లా నుంచి ముగ్గురు అభ్యర్థులు సత్తాచాటారు. ధారూరు మండలం నాగారం గ్రామానికి చెందిన వర్షిత రాష్ట్రస్థాయిలో 100వ ర్యాంకు సాధించి మల్టీజోన్–2లో 40వ స్థానంలో నిలిచారు. కుల్కచర్లకు చెందిన మోనికారాణి 263వ ర్యాంకుతో ఎస్సీ కేటగిరీలో 16వ స్థానంలో నిలిచారు. తిర్మలాపూర్‌కు చెందిన గొల్ల మారుతి జనరల్ కేటగిరీలో 168వ ర్యాంకు సాధించారు.

– కుల్కచర్ల/ధారూరు

గ్రూప్-1 ఉద్యోగిగా ఏఓ



నరేందర్‌రెడ్డి, నవనీత దంపతులకు వర్షిత, శ్రీనిధి ఇద్దరు కూతుళ్లు. అగ్రికల్చర్ ఎంఎస్సీ చేసిన వర్షిత గ్రూప్–1 పరీక్షకు రెండున్నరేళ్లుగా శ్రమించారు. గతంలో గ్రూప్–4 ఫలితాల్లో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. అనంతరం 2024లో టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన అగ్రికల్చర్ ఆఫీసర్ పరీక్షల్లో 10వ ర్యాంకు సాధించిన ఆమె యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారయణపూర్‌లో ఏఓగా పనిచేస్తున్నారు. ఇటీవల ప్రకటించిన గ్రూప్–2 ఫలితాల్లోనూ 215వ ర్యాంకు సాధించారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే గ్రూప్–1కు ఎంపికయ్యాయని వర్షిత వెల్లడించారు.

రెండేళ్ల శ్రమకు 168వ ర్యాంకు



కుల్కచర్ల మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన గొల్ల మారుతి రెండేళ్లుగా సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. పద్మ చిన్నఆంజనేయులు దంపతుల కుమారుడు మారుతి ఢిల్లీలోని హిందూలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన నాటి నుంచి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నారు. ఆదివారం ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాలలో 168వ జనరల్ ర్యాంకును సాధించారు. కేంద్ర సర్వీసులో సివిల్స్ పొందాలనే సంకల్పంతో ముందుకుసాగుతున్నట్లు ఆయన చెప్పారు.

గృహిణి నుంచి గ్రూప్-1 ఆఫీసర్



ఓ వైపు గృహిణిగా ఇంటి బాధ్యతను చూస్తూ.. ఉద్యోగం చేస్తూ.. పిల్లలను సంరక్షిస్తూ ఉన్నత ఉద్యోగం సాధించడంలో మోనికారాణి శ్రమ ప్రతిబింబిస్తుంది. 2010 ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్–4లో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. అనంతరం 2012లో వీఆర్వోగా ఎంపికయ్యారు. అనంతరం గత ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దు చేయడంతో నాంపల్లి ఇంటర్మీడియెట్ బోర్డులో జూనియర్ అసిస్టెంట్‌గా నియమితులయ్యారు. ఎం.ఏ ఇంగ్లిష్ పూర్తిచేసిన ఆమె 2007లో కుల్కచర్లకు చెందిన తుప్పలి అశోక్‌కుమార్‌ను వివాహం చేసుకున్నారు. కష్టంతో పాటు కుంటుంబ సభ్యుల సహకారమే తనను గ్రూప్–1 ఆఫీసర్‌ను చేసిందని మోనికారాణి అన్నారు.

మీది సాయం మాది ప్రోత్సాహం

ప్రమాదంలో గాయపడి సమయానికి సరైన వైద్యం అందక ఎన్నో ప్రాణాలు పోతున్నాయి.. ఘటన జరిగినప్పుడు కేసులు.. పోలీసులు మా కెందుకీ పంచాయితీ అనుకుని చాలామంది చూస్తూ వెళ్తున్నారే తప్ప సాయం చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.. ఇలాంటి సమయాల్లో క్షతగాత్రులను తక్షణమే ఆస్పత్రుల్లో చేర్చండి.. మీకు మేమున్నాం అంటూ భరోసా కల్పిస్తోంది కేంద్రం.. ప్రోత్సహించడంతోపాటు ప్రోత్సాహకం అందిస్తోంది.



ఆపద్బాంధవులకు కేంద్రం భరోసా

- క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రులకు తరలించండి
- గుడ్ సమరిటన్ పథకంతో గుర్తిస్తాం
- రూ.5వేలు ప్రోత్సాహకం.. ప్రశంసా పత్రం

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2021లో గుడ్ సమరిటన్ పథకానికి శ్రీకారం చుట్టింది. జాతీయ స్థాయి అవార్డులకు అవకాశంతో పాటు రూ.5వేల నగదు, ప్రశంసాపత్రం అందిస్తోంది. గాయపడ్డ వారిని ఆస్పత్రికి తీసుకెళ్తే కేసు, పోలీసుల పంచాయితీ ఉంటుందని గతంలో సాయం చేసేందుకు వెనుకాడేవారు. ప్రస్తుతం అవగాహన పెరగడంతో పాటు సాయం చేసేందుకు ముందుకు వస్తున్నారు. 108 వాహనం అందుబాటులో లేకపోతే తమ వాహనంలో, ఇతర వాహనాల్లో ఆస్పత్రికి తీసుకెళ్లి చేర్చుతున్నారు. గుడ్ సమరిటన్ పథకం ద్వారా ఇలాంటి వారికి ప్రోత్సాహం లభిస్తోంది.

ఆస్పత్రులకు తరలించి.. ప్రాణాలను నిలబెట్టి

సకాలంలో వైద్యం అందక రోడ్డు ప్రమాద బాధితుల్లో దాదాపు 50 శాతం మృతి చెందుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. కొందరు సాయం చేయకపోగా సంఘటనా స్థలంలో క్షతగాత్రులను వీడియో, ఫొటోలు తీసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. సమరిటన్ పథకం అందరినీ సాయం చేసేలా ప్రోత్సహిస్తోంది. మారుమూల ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు 108 అంబులెన్స్ రావడం సైతం ఇబ్బందికరంగా మారుతోంది. అలాంటి సమయాల్లో చాలామంది ఆటోలు, ద్విచక్ర వాహనాలపై తీసుకెళ్తున్నారు. సరైన సమయంలో ఆస్పత్రులకు తరిలించడం ద్వారా ప్రాణాలను నిలబెడుతున్నారు.

ప్రశంసలతోపాటు నగదు ప్రోత్సాహకం

ప్రమాదం జరిగిన గంటలోగా ఆస్పత్రికి తీసుకొస్తే ప్రాణాపాయం నుంచి కాపాడొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీన్నే గోల్డెన్ అవర్‌గా పేర్కొంటున్నారు. ఇప్పుడు కేంద్రం ప్రకటించిన సమరిటన్ తో గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రిలో చేర్చిన వారికి రూ.5 వేలు అందనున్నాయి. ఇందుకు దరఖాస్తు చేసుకోవాలంటే పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలు లెటర్ ప్యాడ్‌పై వివరాలు రాసి ఇవ్వాల్సి ఉంటుంది. పోలీసులు కూడా కేసుతో సంబంధం లేకుండా రాసివ్వాలని నిబంధనల్లో పేర్కొన్నారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. బ్యాంకు ఖాతా నంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ జత చేస్తే నేరుగా వారి ఖాతాలో నగదు జమ అవుతుంది. ప్రశంసాపత్రం కూడా అందుతుంది. సంవత్సరానికి గరిష్ఠంగా ఐదు అవార్డులు ఇస్తారు. అత్యంత విలువైన మంచి సహాయకులకు ఒక్కొక్కరికి రూ.లక్ష నగదు, జాతీయ స్థాయి అవార్డులు సైతం ఇస్తారు. అత్యవసర పరిస్థితుల్లో రోడ్డు ప్రమాద బాధితులకు సాయం చేయడానికి ప్రజలను ప్రేరేపించడం.. చట్టపరమైన పరిణామాలకు భయపడకుండా సాయం చేసే సంస్కృతిని పెంపొందించడం ఈ పథకం లక్ష్యం. ఈ పథకంపై సమగ్రంగా ప్రచారం చేసి అవగాహన కల్పిస్తే .. మరింత మంది ముందుకు వచ్చే అవకాశం ఉంది.

ప్రజలను చైతన్యం చేస్తాం



కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన గుడ్ సమరిటన్ పథకంపై ప్రజలను చైతన్యం చేస్తాం. అవగాహన సమావేశాలు నిర్వహించేలా స్థానిక పోలీసులకు, వివిధ శాఖల అధికారులకు సూచిస్తాం. గాయపడ్డ వారిని ఆస్పత్రిలో చేర్పిస్తే గుర్తింపు లభిస్తుంది. దాంతో పాటు ఆర్థిక సహకారం అందుతుంది. ప్రభుత్వాలు గుర్తిస్తాయి.

– కేపీవీ రాజు, ఏసీపీ, ఇబ్రహీంపట్నం



సర్వభూపాల వాహనంపై శ్రీవారి ఊరేగింపు

ఘనంగా గరుడ వాహన సేవ

- మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీవారు
- గోవిందన నామస్మరణతో మార్మోగిన బాలాజీనగర్

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన పద్మావతీ సమేత మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వైఖానస ఆగమ శాస్త్రోకంగా తిరుమల తరహాలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి సర్వభూపాల వాహనంపై ఊరేగిన శ్రీవారు ఆదివారం ఉదయం మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం

బాలాజీనగర్‌లో వెలిసిన కలియుగ వైకుంఠ దైవం.. కొడంగల్ ప్రాంత ప్రజల ఇలవేల్పుగా ఉన్న వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం గరుడ వాహన సేవ. ఆదివారం రాత్రి 10 గంటలకు భూదేవి శ్రీదేవి సమేతంగా గరుడ వాహనంపై ఆసీనులైన శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. జాతర స్థలం వరకు కొనసాగిన ఈ ఊరేగింపు ఆద్యంతం గోవింద నామస్మరణతో కొనసాగింది.

వైభవంగా లంకాదహనం

ఆదివారం అర్ధరాత్రి (తెల్లవారితే సోమవారం) వేంకటేశ్వరస్వామి జాతర స్థలంలో లంకాదహన కార్యక్రమం వైభవంగా జరిగింది. టపాసులు వెలుతురులు ఆకాశంలో కనువిందు చేశాయి. చెన్నై నుంచి ప్రత్యేకంగా తెప్పించిన టపాసులతో లంకాదహనం నిర్వహించారు.



మోహినీ అవతారంలో స్వామి వారు



గరుడ వాహనంపై ఆసీనులైన శ్రీవారు



పంచాంగ పఠనం చేస్తున్న అర్చకుడు రంగరాజన్

‘విశ్వావసు’తో అభయం

చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: విశ్వావసు నామ సంవత్సరం అభయం ప్రసాధిస్తుందని చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ అన్నారు. ఉగాది సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆలయంలో పంచాంగ పఠనం చేశారు. ముందుగా స్వామివారిని ఆలయ మండపంలో ఆసీనులను చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి సన్నిధిలో పంచాంగం చదివి వినిపించారు. విశ్వావసు నామ సంవత్సరం ఏ విధమైన భయం లేకుండా అభయం ఇస్తుందన్నారు. ఈసారి వర్షాలు సమృద్ధిగా పడకపోయినా అనావృష్టి మాత్రం ఉండదన్నారు. స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉంటాయన్నారు.

బ్రహ్మోత్సవాల పత్రిక విడుదల

చిలుకూరు బాలాజీ దేవాలయం బ్రహ్మోత్సవాల పత్రికను ఆదివారం ఆలయ అర్చకులు ఆవిష్కరించారు. పంచాంగ శ్రవణం అనంతరం స్వామివారి పాదాల వద్ద పత్రికను ఉంచి పూజలు చేశారు. అనంతరం గ్రామ పెద్దలతో కలిసి పత్రికను ఆవిష్కరించారు. ఏప్రిల్ 7 నుంచి 14 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని అర్చకుడు రంగరాజన్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా సంతానం లేని మహిళలకు స్వామివారి గరుడ ప్రసాదం పంపిణీ ఈసారి ఉండదని స్పష్టం చేశారు. సంతాన భాగ్య ప్రసాదాన్ని మే నెల నుంచి ప్రతి శుక్రవారం పంపిణీ చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాల కృష్ణస్వామి, అర్చకులు బాలాజీ, కిట్టు, సురేష్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుండు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు పోస్టులు.. ఒక్కరే అధికారి!

వేధిస్తున్న ఉద్యోగుల కొరత

- పదేళ్లుగా నియామకాలు నిల్
- 40 మంది పని చేయాల్సిన చోట 15 మందే..
- సీఈఐజీ గుప్పిట్లోనే కీలక పోస్టులు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: విద్యుత్ ప్రధాన తనిఖీ అధికారి కార్యాలయంలో ఉద్యోగుల కొరత వేధిస్తోంది. పదేళ్లుగా కొత్త నియామకాలు లేకపోవడం.. ఉన్నవాళ్లకు పదోన్నతులు రాకపోవడంతో కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ గవర్నమెంట్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ హైదరాబాద్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ రూరల్, ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ నిజామాబాద్ పోస్టుల్లో ఒక్కరే విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఇప్పటికే ఉన్న 17,130 హెచ్‌టీ కనెక్షన్లకు పీరియాడికల్ ఇన్‌స్పెక్షన్లు నిర్వహించడంతోపాటు కొత్తగా పుట్టుకొచ్చే చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలు, సినిమా థియేటర్లు, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్, హోటల్స్, ఐటీ, అనుబంధ సంస్థల కార్యాలయాలు, క్రషర్ మిషన్లు, రెడీ మిక్స్ ప్లాంట్లు, గృహ, వాణిజ్య బహుళ అంతస్తుల భవన సముదాయాలను తనిఖీ చేసి వాటికి అనుమతులు జారీ చేయాల్సి ఉంటుంది.

- కీలకమైన పోస్టులన్నీ ఖాళీగా ఉండడం, ఒక్కరే ఈ బాధ్యతలన్నీ నిర్వర్తించాల్సి రావడంతో అనుమతుల జారీలో తీవ్ర జాప్యం నెలకొంటోంది.

థర్డ్‌పార్టీ నివేదికలను గుడ్డిగా అనుసరిస్తూ..

- విద్యుత్ పనుల్లో నాణ్యత ప్రమాణాల పెంపు, ప్రమాదాల నియంత్రణ కోసం ప్రభుత్వం విద్యుత్ ప్రధాన తనిఖీ అధికారి విభాగాన్ని ఏర్పాటు చేసింది. 75 కేవీఏ సామర్థ్యం దాటిన ఏదైనా బహుళ అంతస్తుల భవనం సహా పరిశ్రమలకు విద్యుత్ కనెక్షన్లను జారీ చేయాలంటే ముందు ఈ సీఈఐజీ అనుమతి తప్పనిసరి. అధికారులు తమ తనిఖీల్లో భాగంగా ఎర్తింగ్, వైరింగ్, బ్రేకర్స్ పని తీరు, షార్ట్ సర్క్యూట్ ప్రొటెక్షన్స్, లైటింగ్ ఎరిస్టర్స్ ఎర్తింగ్, హెచ్‌టీ, ఎల్టీ ప్రొటెక్షన్స్, ట్రాన్స్‌ఫార్మర్ ప్రైమరీ, సెకండరీ ప్రొటెక్షన్స్‌ను పరిశీలించాల్సి ఉంది.
- ఐఎస్‌ఐ ప్రమాణాల మేరకు ఆయా సాంకేతిక పరికరాలను, కేబుళ్లు, స్విచ్ బోర్డులు వాడారా లేదో? పరిశీలించాలి. నిర్దేశిత ప్రమాణాల మేరకు అన్ని ఉన్నట్లు నిర్ధారించుకున్న తర్వాతే ఆయా భవనాలు, పరిశ్రమలకు అనుమతులు జారీ చేయాల్సి ఉటుంది. అయితే సిబ్బంది కొరతతో థర్డ్‌పార్టీ సమర్పించిన నివేదికను గుడ్డిగా అనుసరిస్తున్నారు. క్షేత్రస్థాయి వరకు వెళ్లినా.. కారు దిగకుండానే ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు.

అడ్డుకుంటూ.. అడ్డగోలుగా సంపాదిస్తూ..

డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ హైదరాబాద్ పరిధిలో రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలు ఉంటాయి. డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ రూరల్ పరిధిలో మెదక్, ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాలు ఉన్నాయి. ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ నిజామాబాద్ పరిధిలో కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలు ఉన్నాయి.

– 2014 నుంచి కొత్త నియామకాలు లేకపోవడంతో 15కు పైగా ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 11 కేవీ కనెక్షన్లు 16,140 వరకు ఉండగా, 33 కేవీఏ కనెక్షన్లు 883 వరకు ఉన్నాయి. 132కేవీ కనెక్షన్లు 107 వరకు ఉన్నాయి. మెజార్టీ కనెక్షన్లు గ్రేటర్ పరిసర ప్రాంతాల్లోనే ఉన్నాయి. పీరియాడికల్ ఇన్‌స్పెక్షన్లలో భాగంగా ఒక్కో అధికారి రోజుకు సగటున 50 కనెక్షన్లను తనిఖీ చేయాల్సి వస్తోంది. వీటితో పాటు కొత్తవాటికి అనుమతులు జారీ చేయాలి. కొంత మంది అధికారులు ఒకే చోట ఏళ్లుగా పాతుకుపోయారు. సమాన కేడర్‌లో పని చేస్తున్న తోటి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి, పోస్టులు కట్టబెట్టే అవకాశం ఉన్నా.. తమకున్న ఆర్థిక పలుకుబడితో వాటికి అడ్డుపడుతున్నట్లు తెలిసింది. ఫలితంగా కొత్తవాళ్లకు అవకాశాలు లేకుండా పోతుండటంతో పాటు ఏళ్లుగా పాతుకుపోయిన వాళ్ల అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి.

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

దుద్యాల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని దుద్యాల్ గేట్ వద్ద చలివేంద్రాన్ని మ్యాకం ప్రభాకర్ కుటుంబ సభ్యులు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మేరుగు వెంకటయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మ్యాకం లక్ష్మమ్మ–నారాయణల జ్ఞాపకార్థంగా పదేళ్ల నుంచి చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. కేంద్రంలో పచ్చడిని ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు వేణు, సత్యనారాయణ, సురేశ్, మధుసుదన్‌రెడ్డి, మహేశ్, సంజీవ్ కుమార్, పకీరప్ప, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

దేశ అభ్యున్నతికి మోదీ అవసరం


మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

కుల్కచర్ల: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం మరింత ఉన్నత స్థితికి చేరుకుంటుందని బీజేపీ కుల్కచర్ల మండల అధ్యక్షుడు గుడాల వెంకటయ్యముదిరాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని చెల్లాపూర్ గ్రామంలో కార్యకర్తలతో కలిసి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ అభ్యున్నతికి ప్రధాని మోదీ నాయకత్వం ఎంతో అవసరమన్నారు. పేదరిక నిర్మూలన, నైపుణ్యం గల యువతను తీర్చిదిద్దే శక్తి మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గసభ్యుడు గాదె మైపాల్, బూత్ అధ్యక్షుడు ఆంజనేయులు, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడుసు మైపాల్, స్థానిక నేత రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



బషీరాబాద్: ఇఫ్తార్ విందులు హిందూ, ముస్లింల మధ్య మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మసీద్‌లో ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారికి ఇఫ్తార్ విందునిచ్చారు. పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రంజాన్ శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, నాయకులు సత్యానారాయణరెడ్డి, ఫకీర్‌అహ్మద్, రజాక్, ఫయాజ్, మునీర్, పాల్గొన్నారు.

ఖురాన్ గ్రంథం అందజేత


తార్యానాయక్, కృష్ణంరాజులకు ఖురాన్ గ్రంథాన్ని అందిస్తున్న మైనారిటీ నాయకులు

కొడంగల్ రూరల్: పవిత్ర రంజాన్ మాసంను పురస్కరించుకొని ప్రతి ఏడాది మాదిరిగానే ముస్లిం సోదరులు ఖురాన్ గ్రంథాన్ని స్థానిక నేతలకు అందజేశారు. ఆదివారం పట్టణంలోని మక్కా మసీద్‌లో కాంగ్రెస్ నాయకులు తార్యానాయక్, జూనియర్ కృష్ణంరాజులకు మైనారిటీ నాయకులు ఖురాన్ గ్రంథం (తెలుగు అనువాదం)ను ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎం.గౌసన్, వాహెద్‌రాజ, అమీర్, అస్మత్, అహ్మద్‌కాన్, సాబీర్, జియావుద్దీన్, రహమత్‌ఖాన్, మైమూద్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటి పూట.. కనిపెట్టాలి ఓ కంట

- వేసవి దృష్ట్యా పిల్లల విషయంలో అప్రమత్తత అవసరం
- బయటకు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే..

దౌల్తాబాద్: వేసవి కాలం దృష్ట్యా పాఠశాలలకు ఒంటి పూట బడులు కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం సెలవు కావడంతో పిల్లలు ఆటలాడేందుకు బయటకు వెళ్తుంటారు. ఒక్కోసారి ఆనందం వెన్నంటే విషాదాలు పొంచి ఉండే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించి పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఒంటి పూట బడుల సమయంలో పిల్లలు సరదాలకు అలవాటు పడి తల్లిదండ్రులు వారించినా ఇంటి పట్టున ఉండేందుకు సుముఖత చూపరు. ఇంట్లో చెప్ప పెట్టకుండా సరదా కోసం బయటకు వెళ్లి ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఎక్కువ. వారిని ఓ కంట పెట్టాల్సిన అవసరం ఉంది.

సరదా మాటున ప్రమాదం

మధ్యాహ్నం పాఠశాలలకు సెలవు కావడంతో పిల్లలు స్నేహితులతో కలిసి బావులు, చెరువుల్లో ఈత కొట్టేందుకు నేర్చుకోవడానికి వెళ్తుంటారు. సరదా మాటున ప్రమాదం పొంచి ఉందనే విషయం తల్లిదండ్రులు గ్రహించాలి. ఈత నేర్చుకునే క్రమంలో బావులు, చెరువులు, కుంటలు వాగులు లోతును అంచనా వేయక అందులోకి దిగుతారు. తీరా దిగాక లోతు ఎక్కువగా ఉండడం, మట్టి పేరుకుపోయి ఉండడం తదితర కారణాల వల్ల చిన్నారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. తల్లిదండ్రులు పర్యవేక్షణలోనే ఈత నేర్చుకోవాలి. అలాగే ఎండలో తిరగడం వలన అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. వడదెబ్బకు గురవ్వడంతో జ్వరం వంటివి రావొచ్చు. కాబట్టి వాళ్లని నీడ పట్టునే ఉండేలా చూడాలి.

గతంలో ఘటనలు

మండల పరిధిలోని గోకాఫసల్వాద్ గ్రామ సమీపంలోని చెరువులో గతేడాది ఈతకు వెళ్లి ఇద్దరు పిల్లలు మృతి చెందారు. రెండేళ్ల క్రితం గుమ్మడాల గ్రామంలో ఇదే క్రమంలో బావిలో దిగి ఓ విద్యార్థి మృతి చెందాడు. ఏ మాత్రం అప్రమత్తంగా లేకున్నా అనుకోని విషాదాన్ని తల్లిదండ్రులు మోయాల్సి ఉంటుంది.

వాహనాలతో జాగ్రత్త

ద్విచక్రవాహనాలు, సైకిళ్లు అంటే పిల్లలకు ఇష్టం ఎక్కువ. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వాటిని నడుపుతూ రోడ్డెక్కితే ప్రమాదాల బారిన పడే అవకాశ ఉంది. కాబట్టి వాటికి దూరంగా ఉంచాలి. అవసరమైతే పెద్దలు పక్కనే ఉంటి వాటిని నడపడం నేర్పాలి.


దౌల్తాబాద్ చెరువులో ఈత కొడుతున్న చిన్నారులు

ఇవి ముఖ్యం

- ఒంటిపూట బడి వదలాగానే మధ్యాహ్నం వేళ పిల్లలకు అవసరమైతే తప్ప బయటకు పంపొద్దు.
- ఈ సమయంలో వీలును బట్టి తల్లిదండ్రులు తమ పిల్లలతో గడిపేందుకు అధిక సమయం కేటాయించాలి.
- ఇంటి పట్టున ఉడే పిల్లలకు వారి పని(హోం వర్క్)లో సహాయం చేయాలి.
- పాఠశాల నుంచి మధ్యాహ్నం ఇంటికి వచ్చాక చిన్నారులకు పుస్తక పఠనం అలవాటు చేయాలి. నీతి కథలు, స్ఫూర్తిగాథలు చదివే విధంగా ప్రోత్సహించాలి.
- అవసరమైతే నీడ పట్టున ఆడుకునే ఆటలకు ప్రాధాన్యం చెప్పాలి. చదరంగం, క్యారమ్స్ వంటి ఆటలు ఆడేలా చూడాలి.

ప్రమాదవశాత్తు హోటల్ దగ్ధం

ఆమనగల్లు: ప్రమాదవశాత్తు హోటల్‌లో మంటలు చెలరేగాయి. ఈ సంఘటన ఆమనగల్లు పట్టణ సమీపంలోని విఠాయిపల్లి వద్ద హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చైత్ర మెస్ హోటల్ ఆదివారం యథావిధిగా ఉదయం వేళలో కొనసాగింది. మధ్యాహ్నం నిర్వాహకుడు శ్రీను హోటల్‌ను మూసివేశాడు. రాత్రి 8 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గుర్తించిన పలువురు పోలీసులకు, యజమానికి, ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. కల్వకుర్తి అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలను మంటలు ఆర్పారు. అప్పటికే ఫర్నిచర్, ఫ్రిడ్జ్ తదితర సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద స్థలాన్ని ఆమనగల్లు ఎస్ఐ సీతారామ్‌రెడ్డి పరిశీలించి, వివరాలు సేకరించారు.


దగ్ధమవుతున్న హోటల్

బసవేశ్వరుడి మార్గం ఆచరణీయం


విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న వీరశైవ సమాజం సభ్యులు

- వీరశైవ సమాజం కొడంగల్ అధ్యక్షుడు విజయవర్ధన్
- విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

కొడంగల్ రూరల్: సమాజ హితం కోసం పాటు పడిన మహోన్నతమైన వ్యక్తి శ్రీ మహాత్మా బసవేశ్వరుడని వీరశైవ సమాజం నియోజకవర్గ అధ్యక్షుడు కొవూరు విజయవర్ధన్ కీర్తించారు. ఆదివారం తెలుగు సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకొని బసవేశ్వరుడి విగ్రహ ఏర్పాటుకు వీరశైవ సమాజం ఆధ్వర్యంలో పట్టణంలో రావులపల్లి రోడ్డు వద్ద భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12వ శతాబ్దంలోనే కులాలను రూపు మాపడానికి ఉద్యమించిన గొప్ప వ్యక్తి బసవేశ్వరుడని కొనియాడారు. సమాజంలో ఎలా జీవించాలి, స్త్రీ, పురుష లింగ బేధాలు, కుల, మత తారతమ్యం లేకుండా అసమానతలను తుడిచి పెడుతూ.. అందరూ సమానమేనని ఉద్బోధించారన్నారు. ఆయన విగ్రహ ఏర్పాటుకు యావత్ హిందూ సమాజం మద్దతు తెలిపాలని పిలుపునిచ్చారు. బసవేశ్వరుడి మార్గాన్ని అనుసరిస్తూ సమాజ సేవ చేయడంతోనే నిజమైన ఆనందం పొందే వీలుంటుందని చెప్పారు. కార్యక్రమంలో వీరశైవ సమాజం నియోజకవర్గ ప్రచార కార్యదర్శి బుక్క విక్రమ్ కుమార్, కోశాధికారి సూరారం రాకేష్, కొడంగల్ పట్టణ ప్రధాన కార్యదర్శి గడ్డం శేఖరయ్యస్వామి, యువ సమాజ్ అధ్యక్షుడు తారాపురం రవి, నాయకులు సర్వేష్, జగదీశ్వర్‌స్వామి, మల్లేశం, మల్లికార్జున్, వీరశైవ సమాజం సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా భద్రేశ్వరస్వామి జాతర


పూజలు చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

తాండూరు: పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో తొలి ఘట్టానికి శ్రీకారం చుట్టారు. ఉగాది రోజు దేవాలయంలో కమిటీ సభ్యులు, వీరశైవ సమాజం ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కూడలిలో స్వామి వారి రథ చక్రాలకు పూజలు చేశారు. ఆదివారం సాయంత్రం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సోదరుడు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, కరణం పురుషోత్తంరావు పలువురు ప్రజా ప్రతినిధులు నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


రథ చక్రాల ఘట్టంలో భక్తులు

లారీ, బస్సు ఢీ

- క్యాబిన్‌లో ఇరుక్కున్న బస్సు డ్రైవర్
- మరో ఆరుగురికి గాయాలు


డ్రైవర్‌ను బయటకు తీస్తున్న పోలీసులు, స్థానికులు

కొత్తూరు: ముందు వెళ్తున్న లారీని ఓ ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో పాటు అందులోని ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ సంఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధి జాతీయ రహదారి వినాయకస్టీల్ కూడలీ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీసీవీఆర్ సంస్థకు చెందిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, కడప జిల్లా బద్వేల్ నుంచి హైదరాబాద్‌కు వస్తోంది. ఈ క్రమంలో వినాయక స్టీల్ కూడలీ వద్ద.. ముందు వెళ్తున్న లారీని వెనకాల నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ శ్రీనివాస్(38) క్యాబిన్‌లో ఇరుక్కుపోగా, బస్సులోని ప్రయాణీకుల్లో నలుగురికి స్వల్ప గాయాలు, మరో ఇద్దరు రాంజేంద్ర, బాలాజీలకు తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రులను శంషాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మురళీగౌడ్ తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

కొందుర్గు: అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధి ఉత్తరాసిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్ల కుమార్(28) ప్రైవేట్ బస్సు డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఈ క్రమంలో నాలుగేళ్ల క్రితం అప్పచేసి, ఓ బస్సును కొనుగోలు చేశాడు. దాంతో పాటు మరిన్ని అప్పులు చేశాడు. కానీ అప్పులు తీర్చే మార్గం కానరాక పోవడంతో మనస్తాపం చెందిన కుమార్.. శనివారం రాత్రి పొలం వద్దకు వెళ్లొస్తానని వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు రాత్రి 12 గంటల సమయంలో పొ లం వద్దకు వెళ్లిచూడగా.. చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. మృతుడి తండ్రి ఆంజనేయులు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగిని మృతి

షాద్‌నగర్: రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి చెందింది. ఈ సంఘటన పట్టణ సమీపంలోని బైపాస్ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ రాజేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలానగర్ మండలం దాస్‌రాంనాయక్ తండాకు చెందిన అరుణ(25), ప్రసన్నకుమార్ దంపతులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. వీరిద్దరు కారులో బాలానగర్ నుంచి నగరానికి వస్తున్నారు. ఈ క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు బైపాస్ రోడ్డులోని బుచ్చిగూడ బ్రిడ్జి వద్దకు రాగానే.. ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో అరుణ అక్కడిక్కడే మృతి చెందింది. ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్ఐ.. ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వివరాలను తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ దుర్మరణం

ఉప్పల్: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో రోడ్డు దాటుతున్న ఓ మహిళ తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందింది. ఉప్పల్ పోలీసుల సమాచారం మేరకు.. శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో స్టోర్ కీపర్‌గా పని చేస్తున్న మాగంటి స్వరూపారాణి(58) తన భర్త సురేందర్‌తో కలిసి బోడుప్పల్‌లో ఉంటున్నారు. వీరిది ధర్మాసాగర్ మండలం తాటికాయల గ్రామం. శనివారం డ్యూటీకి వెళ్లి తిరిగి వస్తూ ఉప్పల్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో ముషీరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఆమెను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన స్వరూపారాణి అక్కడిక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చల్లని నేస్తాలు పిలుస్తున్నాయ్!

ఎండాకాలం వచ్చేసింది.. ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి.. ఉక్కపోతకు జనాలు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్న సమయంలో రోడ్లపై జీవరాశి లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. వేడి తాపానికి చల్లని నేస్తాలైన కూలర్లు, రంజన్ల వైపు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. మధ్య తరగతి ఉన్నత వర్గాల వారు ఫ్రిజ్‌ల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. మరోవైపు పేదలు రంజన్లు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఒక్కసారిగా దౌల్తాబాద్‌లో మట్టి కుండలకు డిమాండ్ పెరిగింది. – దౌల్తాబాద్



లేగదూడకు బారసాల

లేగదూడకు ఓ రైతు బారసాల చేసిన సంఘటన మండల పరిధిలోని డీకేతండాలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన రమేశ్‌నాయక్ అనే రైతు ఆవుకు మగ లేగదూడ జన్మించింది. దీనికి ఉగాది పండుగ వరకు 11 రోజులైంది. ఈ నేపథ్యంలో ఆయన తన పొలంలోనే తొట్టెల ఏర్పాటు చేసి డోలారోహణం నిర్వహించాడు. దూడకు రాము అనే నామకరణం చేశాడు. – ధారూరు


లేగదూడకు డోలారోహణం ఏర్పాటు చేసిన రైతు

అలరించిన జడ కొప్పు కోలాటం

కళలు అంతరించిపోతున్న ప్రస్తుత కాలంలో ఇప్పటికీ భజనాలపై ఆసక్తితో ఆ గ్రామంలో చిన్నారులు నేర్చుకుంటున్నారు. మండల పరిధిలోని సిరిగిరిపేట్ గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం జడ కొప్పు కోలాటం గ్రామస్తులను అలరించింది. ప్రత్యేక దుస్తులు ధరించిన పిల్లలు చూడముచ్చటగా ఆడారు. దీంతో స్థానికంగా పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు. – తాండూరు రూరల్



యువకుడి ఆత్మహత్య

చదువు ఇష్టం లేక.. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నుంచి దూకి బలవన్మరణం

జీడిమెట్ల: చదువు ఇష్టం లేని ఓ యువకుడు ఫుట్ ఓవర్ బ్రిడ్జి పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ సమాచారం మేరకు... ములుగు జిల్లా వాజేడు మండలం గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన అల్లి రాంబాబు కుమారుడు సాయి ప్రకాష్(20) భద్రాచలంలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సాయిప్రకాష్‌కు చదువుకోవడం ఇష్టం లేదు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం సొంత ఊరికి వచ్చి తనకు చదువుకోడం ఇష్టం లేదని తల్లిదండ్రులకు చెప్పాడు. అందుకు వారు వారిస్తూ చదువుకోవాలని కోరారు. లేదు నేను హైదరాబాద్ వెళ్లి ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటానని తెలిపాడు. వద్దని వారించిన వినకుండా హైదరాబాద్ వచ్చాడు. సాయి ప్రకాష్ జాడ తెలుసుకున్న తండ్రి శనివారం జీడిమెట్లకు వచ్చాడు. షాపూర్‌నగర్‌లో ఇద్దరు కలుసుకుని మట్లాడుతుండగానే సాయి ప్రకాష్ రాత్రి 10 గంటల ప్రాంతంలో షాపూర్‌నగర్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై నుంచి కిందకు దూకాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తండ్రి సాయి ప్రకాష్‌ను ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రూప్-1 ర్యాంకర్‌కు అభినందనలు


కృతికను అభినందిస్తున్న మాజీ కార్పొరేటర్లు

మీర్‌పేట: గ్రూప్–1 ఫలితాల్లో రాష్ట్ర స్థాయి 5వ ర్యాంకు సాధించిన మీర్‌పేట జిల్లెలగూడకు చెందిన సిద్దాల కృతికకు ఆదివారం పలువురు అభినందనలు తెలిపారు. మాజీ కార్పొరేటర్లు ఎనుగుల అనిల్‌యాదవ్, దోమలపల్లి ధనలక్ష్మి, బీఆర్ఎస్ నాయకుడు రాజ్‌కుమార్‌లు కృతికకు మిఠాయి తినిపించి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో యువతి తల్లిదండ్రులు బీరప్ప, లావణ్య ఉన్నారు.

ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి

కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో ఆర్టీసీ కండక్టర్ చంద్రయ్య ఆధ్వర్యంలో భద్రాచలం రాములోరి తలంబ్రాలు పొందేందుకు నాయకులు, గ్రామస్తులు బుక్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీతారాముల కల్యాణం తలంబ్రాలను పొందేందుకు భక్తులు, మండల పరిధిలోని ప్రజలు ఆర్టీసీ అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు అనంతయ్య, భీమయ్య, కృష్ణయ్య, సోమలింగం, బాలకృష్ణ, శ్యామ్, సోమలింగం, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


తలంబ్రాలు బుక్ చేసుకుంటున్న నాయకులు, గ్రామస్తులు